క్లుప్తంగా

కబుర్లు చెప్పే కదిలే బొమ్మలు



కదులుతూ కబుర్లు చెప్పేవి తోలుబొమ్మలు. సినిమాలు, టీవీలు లేని రోజుల్లో జనసామాన్యానికి ఇవే వినోద సాధనాలు. తెరలు కట్టి.. ఆ తెరల వెనుక నుంచి సన్నని దారం సాయంతో వీటిని తోలుబొమ్మలాటగాళ్లు కదిలిస్తూ.. రామాయణ, భారత, భాగవతాల్లోని ఘట్టాలను ప్రదర్శిస్తూ ఉపాధి పొందేవారు. తర్వాతి కాలంలో ఇవి కనుమరుగయ్యాయి. ఈ తరం వారికి వీటి గురించి ఏమాత్రం తెలియదు. మళ్లీ ఇవి ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. నగరంలో పలుచోట్ల ఫుట్‌పాత్‌లపై వీటిని విక్రయిస్తున్నరు.

– జగదాంబ

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల స్వయంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారి స్వయంగా జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు అస్సాం యువకుడు



తండ్రికి కుమారుడిని అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యుడు

సీతమ్మధార: ఎలాంటి రవాణా సౌకర్యం లేని అతి మారుమూల గ్రామం సియుజ్ పూర్. అస్సాంలోని డిబ్రుఘర్ జిల్లా నాసిర్ ఖటియా తాలూకాలో ఉంది. ఆ ప్రాంతానికి చెందిన అకనజన్ మెక్ చిన్న కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. తర్వాత మరో కొడుకు మిదుల్ కూడా ఉపాధి కోసమని స్నేహితులతో కలిసి ఇల్లు వదిలి వెళ్లడంతో తల్లి బెంగతో మంచం పట్టింది. మానసిక సమస్యతో బాధపడుతున్న మిదుల్‌ను సంవత్సరం క్రితం వైజాగ్‌లో రెస్క్యూ చేసి, ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ -ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు షెల్టర్ నిర్వాహకులు. అక్కడ ఆరోగ్యం కుదుటపడ్డాక శ్రద్ధా సంస్థ ద్వారా తీసుకెళ్లి తండ్రి అకనజన్ మెక్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

ఆనంద మేళోత్సవాలకు రాజశేఖర్



డాబాగార్డెన్స్: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఇల్లందు పటేల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు కుసుమ హరనాథ నామ ప్రచార సంస్థ (నల్లకుంట, హైదరాబాద్)చే సాంప్రదాయ రీతిన నిర్వహించనున్న 80వ ఆనంద మేళోత్సవానికి విశాఖకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దువ్వాడ శ్రీకుసుమ హరనాథ ఆశ్రమ కమిటీ సభ్యుడు ఎంవీ రాజశేఖర్‌కు ఆహ్వానం అందింది. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవంలో భాగంగా 18న ఉదయం 11 గంటలకు దీనదయాల్ ప్రభు హరనాథుడు, దీనదయామయి మాతృశ్రీ కుసుమ కుమారిదేవి 'ప్రేమతత్వం'అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..



నిరుపయోగంగా ఉన్న పితానిదిబ్బ సామాజిక మరుగుదొడ్లు

- నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు
- మందుబాబులు, గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్
- మరుగుదొడ్లను తొలగించి సామాజిక భవనం నిర్మించాలని పితానిదిబ్బ, భానోజీనగర్ వాసుల వినతి



తలుపులు లేని మరుగుదొడ్డి

బీచ్‌రోడ్డు: మల, మూత్ర విసర్జనకు బహిరంగ ప్రదేశాలను వినియోగించకూడదనే ఉద్దేశ్యంతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతున్నాయి. ప్రజావసరాల కోసం నిర్మించిన వీటిలో మద్యం, గంజాయి వంటివి సేవించి శిథిలం చేస్తున్నారు. దీంతో చుట్టు పక్కలున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి ఉపయోగం లేని ఈ మరుగు దొడ్లను తొలగించి అక్కడ సామాజిక భవనాలు నిర్మించాలని జీవీఎంసీ 28వ వార్డు లోని పితానిదిబ్బ, భానోజీనగర్ వాసులు కోరుతున్నారు.

అంతంత మాత్రమే వినియోగం..

జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీనగర్ వద్ద, పితానిదిబ్బ వద్ద స్థానికుల కోసం జీవీఎంసీ రెండు సామాజిక మరుగుదొడ్లు నిర్మించింది. అయితే కాలక్రమేణ ఆ ప్రాంతవాసులు ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో వాటి వినియోగం లేక నిరుపయోగంగా పడి ఉన్నాయి. రోజుకు ఈ రెండు మరుగుదొడ్లను 20 మంది కూడా వినియోగించటం లేదు.

తలుపులు లేక ఇక్కట్లు..

మరుగుదొడ్లు వినియోగంలో లేక అవి నిరుపయోగంగా మారాయి. నిర్వహణ కరవై వాటికి తలుపులు కూడా లేకుండా పోయాయి. దీంతో వాటిని వినియోగించటానికి వస్తున్న ఒకరిద్దరు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఆందోళనలో స్థానికులు..

పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల్లో ఉన్న మరుగుదొడ్లు నిరపయోగంగా ఉండటం, జన సంచారం లేకపోవటంతో అవి అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. పట్టపగలు సైతం ఇక్కడ కొందరు మద్యం సేవిస్తుంటారు. ఈ మరుగుదొడ్ల చుట్టూ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా కొంత మంది యువకులు గంజాయి సేవించి మరుగుదొడ్ల వద్దే తిష్ట వేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల వారు అటుగా వెళ్లాలంటే భయపడుతున్నారు.

సామాజిక భవనం నిర్మించాలి..

నిరుపయోగంగా ఉన్న ఈ రెండు మరుగుదొడ్లను కూల్చి సామాజిక భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వందలాది ఇళ్లు ఉన్న ఈ ప్రాంతంలో సామాజిక భవనం లేక ఫంక్షన్లకు ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. ఇదే విషయమై వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ దృష్టికి తీసుకెళ్తే ఆమె దీనిపై జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించారు. త్వరలో జీవీఎంసీ ఉన్నతాధికారులు సమస్య పరిష్కరిస్తారని స్థానికులు ఆశిస్తున్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్ నుంచి తొలగించాలి..

పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల్లో ఉన్న ఈ రెండు మరుగుదొడ్లను జీవీఎంసీ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగం చేసింది. అయితే ఇవి నిరుపయోగంగా ఉండడం వల్ల వీటిని స్వచ్ఛ సర్వేక్షణ్ నుంచి తొలగించి సామాజిక భవనాలు నిర్మించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ కు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు వినతిపత్రం అందజేశారు.



కౌన్సిల్‌లో మరుగుదొడ్ల సమస్యపై మాట్లాడుతున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ (ఫైల్)



జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పల్లా దుర్గారావు (ఫైల్)



సామాజిక మరుగుదొడ్ల వద్ద మద్యం సీసాలు

సామాజిక భవనం నిర్మించాలి..



మా ప్రాంతంలో ఏ చిన్న కార్యక్రమం చేసుకుందామన్నా సరైన స్థలం లేదు. అందుకే ఇక్కడ నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను తొలగించి వాటి స్థానంలో సామాజిక భవనం నిర్మించాలి. రాత్రి వేళల్లో ఇక్కడ కొంత మంది చేరి మద్యం సేవిస్తున్నారు.

– డి. వెంకటరమణ, పితానిదిబ్బ


భయం వేస్తుంది..



ఇక్కడున్న మరుగుదొడ్ల పక్క నుంచి వెళ్లాలంటే భయంగా ఉంటుంది. ఇక్కడ మద్యం, గంజాయి మత్తులో కొంత మంది అలజడి సృష్టిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు రాత్రి వేళ అటుగా వెళ్లటం లేదు. ఆ మరుగుదొడ్లను తొలగించి సామాజిక భవనం నిర్మించాలి.

– పి. నర్సింగరావు, భానోజీనగర్

వెలగని వీధి దీపాలతో సమస్యలు



చినవాల్తేరు కూడలిలో వెలగని విద్యుత్ దీపాలు

ఏయూక్యాంపస్: ప్రధాన కూడళ్లలో వీధి దీపాలు వెలగడం లేదు. ఇక్కడే ఇలా ఉంటే ఇక వీధుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చినవాల్తేరు కూడలిలో మంగళవారం రాత్రి దీపాలు వెలగలేదు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ నుంచి చినవాల్తేరు మీదుగా బీచ్‌రోడ్డుకు, చినవాల్తేరు నుంచి పెదవాల్తేరుకు అనుసంధానం చేసే ప్రధాన కూడలిలో పరిస్థితి ఇది. నిత్యం వేలాది మంది ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఇటువంటి ప్రధానమైన కూడలిలో వీధి దీపాలు వెలగని పరిస్థితి ఉంది. ఈ కూడలిలో పలు క్లినిక్‌లు, మందుల దుకాణాలు ఉన్నాయి. ఇవి నిరంతరం పని చేస్తుంటాయి. రాత్రివేళ అత్యవసరమై మందుల దుకాణాలకు రావాలన్నా చీకట్లు కమ్ముకున్న పరిస్థితి. అదే విధంగా చినవాల్తేరు కూడలి పక్కనే ఉన్న మసీదు వద్ద పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఇక్కడ నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. అదే విధంగా కూడలిలో వెలగని ఎల్ఈడీ దీపాన్ని మార్చాలి. లిల్లీ వైట్స్ క్లబ్ కూడలిలో ఉన్న సోలార్ విద్యుత్ దీపం వెలగడం లేదు. దీనికి ప్రత్యామ్నాయం చూపాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. రహదారిపై ఉన్న దుకాణ దారులు తమ షాముల ముందు ఏర్పాటు చేసుకున్న వీధి దీపాలే దిక్కవుతున్నాయని వాపోతున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై ట్రాఫిక్‌తో ఇక్కట్లు



నిలిచిపోయిన వాహనాలు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న పాండురంగాపురం ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రధానంగా ఆల్ ఇండియా రేడియో నుంచి బీచ్‌రోడ్డుకు అనుసంధానం చేసే ఈ మార్గంలో రోడ్డుపక్కనే కార్లు నిలిపేస్తున్నారు. దీంతో మార్గం ఇరుగ్గా మారిపోయి రెండు వైపులా కార్లు, ఇతర భారీ వాహనాలు ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో, వారాంతరాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు వాపోతున్నారు. బీచ్‌కి వచ్చే పర్యాటకులు సైతం తమ వాహనాలను ఈ ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే నిలిపేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహన చోదకులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. పోలీసులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రధాన రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయకుండా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని, సాయంత్రం వేళల్లో వీటిపై పర్యవేక్షణ ఉండాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు. ఈ దిశగా పోలీసులు దృష్టి సారించి తమకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

తప్ప తాగారు.. చిందులేశారు



మద్యం సేవించి తోపుడు బండి కింద సేద దీరుతున్న మందుబాబు



నడిరోడ్డుపై డీజే వాయిద్యానికి నాగినీ నృత్యం చేస్తున్న మందుబాబులు



పూర్ణామార్కెట్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న మందుబాబు

డాబాగార్డెన్స్: కనుమ పండగ సందర్భంగా మందుబాబులు పూటుగా మద్యం సేవించి నడిరోడ్లపై చిందులేశారు. ఉదయం నుంచే మందుబాబుల హడావిడి కనిపించింది. మార్కెట్లకు వెళ్లి కోడి/మటన్ మాంసం కొనుగోలు చేసి, ఇంటికి ఇచ్చేసి నడిరోడ్డుపై పడ్డారు. తెలియని మత్తులో ఎక్కడ పడ్డారో వారికే ఎరుక. సాయంత్రం పొద్దు పోయే వరకు మద్యం సేవిస్తూ నడిరోడ్లపై చిందులేశారు. చాలా చోట్ల డీజే వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ పలువుర్ని ఆకట్టుకున్నారు. నృత్యాలు వేసే వారు కొందరైతే.. నడిరోడ్డుపై తప్పతాగి పడిన వారు మరికొందరు. ఇలా బస్టాప్‌లు.. ఆటోస్టాండ్లు.. దుకాణాల వద్ద మందుబాబులు సందడి చేస్తూ కనిపించారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కంచరపాలెం : సమాజసేవలో భాగస్వాములు కావాలని సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ ముమ్మల పోలరావు పిలుపునిచ్చారు. కంచరపాలెం పరిధి రామ్మూర్తి పంతులపేటలో కొణతాల వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం శోభన్‌బాబు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలరావు కేక్ కట్ చేసి మాట్లాడారు. సేవా సంఘం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శోభన్‌బాబు చిత్రంతో కూడిన క్యాలెండర్ అవిష్కరించారు. కార్యక్రమంలో కొణతాల వెంకటేశ్వరరావు, చిన్ని, మురళీరాజు, డి.ఎస్.విజయకుమార్, డి.వెంకటరావు, ఎం.సూర్యనారాయణ, పల్లా పైడిరాజు యాదవ్, జి.ఫణిభూషణరావు, కె.సూర్యరత్నం, పి.దేవకి, టి.సూరిబాబు పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ

సీతంపేట : సంక్రాంతి సందర్భంగా భారత వికాస్ పరిషత్ ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, అతని స్నేహితుడు జి.బి.కుమార్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ వద్ద బుధవారం నారాయణ సేవ నిర్వహించారు. పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అలాగే వృద్ధులు, మహిళలకు రగ్గులు, బియ్యం, పప్పు, బెల్లం, నూనె, వంట సామగ్రి పంపిణీ చేశారు. ఆర్.రమణారావు, పి.వెంకటేశ్వరరావు, ఎం.వి.రాజశేఖర్, ఎం.వి.శైలజ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో 'జీవ నదులు'

వివిధ బ్లాకులకు దేశంలోని పలు నదుల పేర్లు



విశాఖ కేంద్ర కారాగారం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం విశాలమైనది. దీని లోపల అన్నీ జీవనదులే ఉన్నాయి. కారాగారం లోపల ఎక్కడికి వెళ్లినా వాటి పేర్లే కనిపిస్తాయి. ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది నోటి నుంచి ఆ పేర్లే వినిపిస్తాయి. లోపల ఉండే ఖైదీల కోసం ములాఖత్‌కు వెళ్లేవారి బంధువులు, స్నేహితులకు ఈ పేర్లు వినిపిస్తాయి. అసలు కారాగారంలో నదులు ప్రస్తావన ఏమిటని అనుకుంటున్నారు కదూ.. ఆ పేర్లతో ఇక్కడ బ్లాకులను పిలుస్తారు. ఆయా బ్లాకుల్లో ఖైదీలు ఉంటారు. సుమారు 100 ఎకరాల్లో విశాఖ కేంద్ర కారాగారాన్ని నిర్మించారు. దీని సామర్థ్యం 914 మంది. దానికి తగినట్లు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రిమాండ్, శిక్ష పడిన ఖైదీలు ఇక్కడ సుమారు 2,000కు పైగా ఉన్నారు. వీరంతా ఇక్కడ వివిధ బ్లాకుల్లో ఉంటున్నారు.

ఇవీ ఇక్కడి నదుల పేర్లు.. : ఇక్కడ 21 బ్లాకులు ఉన్నాయి. త్వరలో మరికొన్ని బ్లాకులు నిర్మాణం చేపట్టనున్నారు. ఆయా బ్లాకులకు దేశంలో ఉండే ప్రముఖ నదుల పేర్లు పెట్టారు. ఆయా పేర్లతోనే వాటిని పిలుస్తారు. ఇక్కడ గంగా, నర్మద, చిత్రావతి, స్నేహ సరోవర్, ప్రాణహిత, శబరి, గోస్తనీ, స్వర్ణముఖి, తపతి, కావేరి, తుంగభద్ర, వంశధార, గోదావరి, కృష్ణవేణి, అన్నపూర్ణ, పెన్నా, నాగావళితో పాటు శాంతివనం, జ్ఞాన సాగర్, స్కిల్ డెవెలప్‌మెంట్ భవనం, పరిశ్రమలు నిర్వహించే భవనం తదితర పేర్లతో దీని లోపల బ్లాకులు నిర్మించారు. గంగా, కృష్ణవేణి బ్లాకుల్లో రిమాండ్ ఖైదీలు ఉంటారు. నర్మదా బ్లాకులో ఇతర రాష్ట్రాలకు చెందిన ఖైదీలను ఉంచుతున్నారు. మావోయిస్టు ఖైదీలను ఉంచడానికి చిత్రావతిని కేటాయించారు. సువర్ణముఖిలో మహిళా ఖైదీలు ఉంటారు. మహిళా ఖైదీలంతా రిమాండ్‌లో ఉన్నవారే. గోదావరి బ్లాకులో శిక్ష పడిన ఖైదీలను ఉంచుతారు. దీన్ని ప్రధానమైన బ్లాకుగా పరిగణిస్తారు. తపతి, కావేరి, పెన్నా బ్లాకులను ఖైదీల సెల్ కోసం వినియోగిస్తున్నారు. వాటితో పాటు స్నేహ సరోవర్‌లో అడ్మిషన్లు, శాంతివనం, గోస్తనీ బ్లాకులను ఆడిటోరియం, శబరిని సిబ్బంది కిచెన్‌కు, అన్నపూర్ణ బ్లాకును ఖైదీల కిచెన్‌కు ఉపయోగిస్తున్నారు. ఇవి కాక నాగావళి, వంశధార, తుంగభద్ర బ్లాకులు ఓపెన్ ల్యాండ్‌గా విడిచిపెట్టారు. ప్రాణహితను ఖైదీల ఆస్పత్రి, జ్ఞాన సాగరాన్ని లైబ్రరీ, ఖైదీలకు పాఠశాలగాను వినియోగిస్తున్నారు. ఫ్యాక్టరీ బ్లాకులో వివిధ పత్రమలు నిర్వహిస్తున్నారు. వాటిలో ఖైదీలు పని చేస్తారు. ఇక్కడ స్కిల్ డెవెలప్‌మెంట్ బ్లాక్‌లో ఖైదీలకు టైలరింగ్, ప్లంబింగ్, భవన నిర్మాణం తదితర చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తుంటారు. ఈ బ్లాకులన్నీ దేశంలో ప్రవహించే జీవనదుల పేర్లతో నిర్వహించడం విశేషం. ఇక్కడ ఖైదీల సంఖ్య నిరంతరం పెరుగుతుండటంతో మరికొన్ని బ్లాకులు నిర్మించే యోచనలో అధికారులున్నారు. కొత్తగా నిర్మించే బ్లాకులకు ఏ పేర్లు పెడతారో వేచి చూడాలి.

ఘనంగా ఆర్మీ డే వేడుకలు



మోహన్‌రావును సత్కరిస్తున్న ప్రభావతి

సీతంపేట : ఆర్మీ డే సందర్భంగా వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మిలటరీలో ఉద్యోగం చేసిన జేసీవో కె.మోహన్‌రావును బుధవారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మోహన్‌రావు మిలటరీ సర్వీస్‌లో దేశానికి చేసిన సేవ, విధుల్లో ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులు, అనుభవాలు వివరించారు. దేశానికి వెన్నుముకగా నిలిచిన ఆర్మీ ఉద్యోగులకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని, ఇలా చిరు సత్కారంతో గౌరవించుకోవడం మన బాధ్యతని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన వృద్ధ మహిళ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శుభ, ఎం.జయ, సీహెచ్. పద్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జీవీఎంసీ దుకాణాలు

పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న టీఎస్ఆర్ కాంప్లెక్స్ దుకాణ సముదాయం

సీతమ్మధార: జీవీఎంసీకి చెందిన టీఎస్ఆర్ కాంప్లెక్స్‌కి ఏళ్ల తరబడి మరమ్మతులు, ప్యాచ్ వర్కులు లేకపోవడంతో కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇక్కడి ద్వారకా బస్‌స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే మార్గంలో గల టీఎస్ఆర్ కాంప్లెక్సులో అధిక సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. జీవీఎంసీ జోన్–3 రెవెన్యూ విభాగం పరిధిలో ఈ వాణిజ్య సముదాయం ఉంది. అలాగే ఈ కాంప్లెక్సులో జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం, నాటక గ్రంథాలయం కూడా ఉన్నాయి. ఈ కాంప్లెక్సులో దశాబ్దాలుగా చెప్పుల దుకాణాలు, ఫ్రూట్ జ్యూస్, హోటళ్లు, బంగారం దుకాణం, బట్టల దుకాణాలు ఉన్నాయి. వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉండే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులు రాలిపోతున్నా జీవీఎంసీ ఇంజినీర్లలో చలనం లేదని స్థానిక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా అద్దెలు వసూలు చేస్తున్న జీవీఎంసీ జోన్–3 రెవెన్యూ విభాగం మరమ్మతులపై దృష్టి సారించడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వర్షాలు పడితే శ్లాబు నుంచి నీరు కారిపోతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఇక్కడ జీ ప్లస్ 2 విధానంలో రెండు భవనాల్లో దుకాణాలు ఉన్నాయి. నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడికి షాపింగ్ నిమిత్తం వస్తుంటారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ఇంజినీర్లు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

మూతపడిన బ్యాంకులు



సీతమ్మధారలో మూతపడిన యూనియన్ బ్యాంక్

సీతమ్మధార : కనుమ రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు మూతపడ్డాయి. వాస్తవానికి గతంలో కనుమ రోజు బ్యాంకులకు వర్కింగ్ డేగా వుంది. కానీ రాష్ట్ర బ్యాంకర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కనుమ రోజు పండగ సెలవు ఇవ్వాలని కోరడం, ప్రభుత్వం అంగీకరించి ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. దీంతో బుధవారం బ్యాంకులు మూతపడ్డాయి. సీతమ్మధారలో గల యూనియన్ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్, నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల బరోడా బ్యాంకు, పీ అండ్ టీ కాలనీలోని గ్రామీణ వికాస్ బ్యాంకు మూతపడ్డాయి. అలాగే ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గల హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకు, కరూర్ వైశ్యా బ్యాంకు బ్రాంచిలు మూతపడ్డాయి. నిత్యం వినియోగదారులతో రద్దీగా కనిపించే బ్యాంకులన్నీ ప్రభుత్వ సెలవు కారణంగా బోసిపోయి కనిపించాయి. బ్యాంకు పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ కానరాలేదు.